ప్రజాశక్తి
మంగళవారం 09 సెప్టెంబర్ 2025 | 5 | కర్నూలు



క్వింటా ఉల్లికి రూ.2400 ఇవ్వాలి

- ఉల్లి రైతులపై వెంటనే సిఎం దృష్టి పెట్టాలి
- ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

ఉల్లి రైతులకు వెంటనే క్వింటాకు రూ.2400 గిట్టుబాటు ధర ఇవ్వాలని ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు మార్కెట్ యార్డ్‌ను ఆమె సందర్శించారు. రైతులతో ఆమె మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. (వార్త మెయిన్‌లో..)



'ఆరోగ్యశ్రీ'కి మంగళం..

- ఆందోళనలో వైద్య సేవ సిబ్బంది
- ఇన్సూరెన్స్ విధానంతో ఉద్యోగ భద్రతపై అనుమానాలు
- 17 ఏళ్లుగా సమస్యలను పరిష్కారం కరువు

కూటమి ప్రభుత్వం ఎన్‌టిఆర్ వైద్యసేవ స్థానంలో ఇన్సూరెన్స్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించడంతో ఎన్‌టిఆర్ వైద్య సేవ సిబ్బందిలో ఆందోళన వ్యక్తం అవుతోంది. వారి ఉద్యోగ భద్రతపైనా అనుమానాలు తలెత్తాయి. 17 ఏళ్లుగా పని చేస్తున్నా వారి సమస్యలకు పరిష్కారం కరువైంది..



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

గతంలో ఆరోగ్యశ్రీ, ప్రస్తుతం ఎన్‌టిఆర్ వైద్యసేవ ట్రస్ట్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. ఎన్‌టిఆర్ వైద్యసేవలో ఉద్యోగులుగా వైద్య మిత్రలు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్లు, సిసి మానటరింగ్ డిఇఒలు పనిచేస్తున్నారు. కర్నూలు జిల్లాలో 96 మంది వైద్య మిత్రలు, ఏడుగురు టీం లీడర్లు, ఒక జిల్లా మేనేజర్ పని చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో 66 మంది వైద్య మిత్రలు, ఆరుగురు టీం లీడర్లు, ఒక జిల్లా మేనేజర్ ఉన్నారు. ప్రస్తుత పరిస్థితులలో ఎన్‌టిఆర్ వైద్యసేవలో అందిస్తున్న వైద్యసేవలు ప్రజలకు అత్యంత కీలకంగా మారాయి. వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో డయాలసిస్, గుండె, ఎముకలకు సంబంధించిన అనేక ఆపరేషన్లు, కేన్సర్‌తోపాటు అనేక రోగాలకు వైద్యసేవా ట్రస్ట్ ద్వారానే వైద్యసేవలు జనం పొందుతున్న పరిస్థితి కొనసాగుతోంది. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పేరుతో ఈ పథకం కొనసాగించింది. ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్ కింద కర్నూలు జిల్లా వ్యాప్తంగా 99 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నాయి. వాటిలో 55 ప్రయివేటు ఆస్పత్రులు కాగా మిగతావి ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయి. ఎన్‌టిఆర్ వైద్యసేవ సక్రమంగా అమలు చేయడంలో అందులో పనిచేస్తున్న ఉద్యోగులదే కీలక పాత్ర. అలాంటి ఉద్యోగుల పరిస్థితి మాత్రం అత్యంత ఘోరంగా ఉందని చెప్పొచ్చు. ఎన్‌టిఆర్ వైద్యసేవలో చాలామంది 17 ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఉద్యోగులకు ఇచ్చే జీతం మాత్రం రూ.15 వేలు కాగా, కటింగ్‌లు పోను చేతికొచ్చే జీతం రూ.13,080 మాత్రమే. ప్రస్తుతం కూరగాయల నుంచి నిత్యావసర ధరల వరకూ ఆకాశాన్ని తాకుతున్నాయి. స్కూల్ ఫీజులు వంటివి అందనంత ఎత్తులో ఉన్నాయి. అయినప్పటికీ ఎన్‌టిఆర్ వైద్యసేవ ఉద్యోగుల జీతాలు మాత్రం పెరగడం లేదు. దీంతో ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులను కలిసి విన్నవించుకున్నా సమస్యలకు పరిష్కారం దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో తమ సమస్యల పరిష్కారం కోసం ఎన్‌టిఆర్ వైద్యసేవా ఉద్యోగులు నిరసన గళం విప్పారు.

పరిష్కారానికి నోచని కనీస డిమాండ్లు

ఎన్‌టిఆర్ వైద్యసేవలో పనిచేస్తున్న ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలు ఏమీ కోరడం లేదు. 17 ఏళ్లుగా పనిచేస్తున్న తమను ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి జిఒ ఏడు ప్రకారం కేటగిరి-1 డిపిఒ (డిజిటల్ ప్రొసెసింగ్ ఆఫీసర్) క్యాడర్ అమలు చేయాలని కోరుతున్నారు. ఉద్యోగులు ఎవరైనా చనిపోతే వారి కుటుంబాలకు రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా, పదవీ విరమణ బెనిఫిట్స్‌గా రూ.పది లక్షలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజ్ కల్పించాలని కోరుతున్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగులకు అంతర్గత ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్‌టిఆర్ వైద్యసేవలో పనిచేస్తున్న ఉద్యోగులు అడుగుతున్న డిమాండ్లు చాలా సాధారణమైనవని చెప్పొచ్చు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరడం ఏవిధంగా తప్పు అవుతుందో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. ఎన్‌టిఆర్ వైద్యసేవలో వైద్యం పొందే రోగులు చేరినప్పటి నుంచి డిశ్చార్జ్ వరకూ అన్ని పనులూ ఉద్యోగులే నిర్వహిస్తుంటారు. ఎంతోమంది రోగులకు సహాయకారిగా ఉంటూ అన్ని విషయాలూ తెలియపరుస్తూ అవగాహన కల్పిస్తారు. సామాన్య ప్రజానీకంతో పనిచేసే కీలకమైన ఉద్యోగులు వీరు. అలాంటి ఉద్యోగులకు సంబంధించిన కనీస సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యతగా చెప్పొచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్‌టిఆర్ వైద్యసేవ ఉద్యోగులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.

ఆటో డ్రైవర్లను తక్షణమే ఆదుకోవాలి

- ఏడాదికి రూ.30 వేలు ఇవ్వాలి - సిఐటియు, ఆటో డ్రైవర్స్‌యూనియన్ డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోతున్న డ్రైవర్లను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు పిఎస్ రాధాకృష్ణ, ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌లు డిమాండ్ చేశారు. ఏడాదికి రూ.30వేలు ప్రతి ఆటో డ్రైవర్‌కు ఇవ్వాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు జిల్లా ఉపాధ్యక్షులు బి.రాధాకృష్ణ అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, జిల్లా సహాయ కార్యదర్శి పి.మహమూద్ మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రభుత్వం కల్పించిందని, అదే రోజు ఉచిత బస్సుల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను అన్ని విధాలా ఆదుకుంటానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించి ఇంత వరకు ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. ప్రయాణికులే జీవనాధారమైన ఆటో డ్రైవర్లు ఉచిత బస్సు వల్ల ప్రయాణికులు లేక ఖాళీగా ఆటోలు తిరిగే పరిస్థితి నెలకొందన్నారు. రోజుకు రూ.300 కూడా సంపాదించే పరిస్థితి లేదన్నారు. గతంలో వాహన మిత్ర పథకం కింద గత ప్రభుత్వం రూ.10 వేలు ప్రతి ఆటో డ్రైవర్‌కు ఇచ్చిందని, కూటమి అధికారంలోకి వస్తే రూ.15 వేలు ఇస్తానన్న ఈ ప్రభుత్వం 16 నెలలైనా ఇవ్వలేదన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలు పెట్రోల్, డీజిల్ ధరలు, ఫైనాన్స్ కంతులు చెల్లించడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ నెల 18న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈ కార్యక్రమలో ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు న్యూ సిటీ అధ్యక్ష కార్యదర్శులు నాగేష్, నరసింహులు, ఆటో యూనియన్ న్యూ సిటీ, ఓల్డ్ సిటీ అధ్యక్షులు ఎస్.హుస్సేన్ వలి, డి.కుమార్, చిన్న వ్యాపారస్తుల సంఘం నగర కార్యదర్శి ఎస్ఎండి రఫీ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, ఆటో డ్రైవర్లు

పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పరిశ్రమలు నెలకొల్పే పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం మరింత ప్రోత్సాహం కల్పించేందుకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ వెల్లడించారు. సోమవారం కర్నూలు నగరంలోని తనిష్క్ ఫంక్షన్ హాల్లో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి టీజీ భరత్‌తో పాటు కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు పి.రంజిత్ భాష, రాజకుమారి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ అభిశిక్త్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత 15 నెలల్లో పరిశ్రమల వర్గాలలో ఒక దృఢమైన నమ్మకాన్ని తీసుకుని రాగలిగామని తెలిపారు. గతంలో పరిశ్రమల వర్గాలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాయని చెప్పారు. వచ్చే రెండు నెలల్లో దాదాపు రూ. 5 వేల నుండి 6 వేల కోట్లు ఇన్సెటీవ్స్ పరిశ్రమలకు క్లియర్ చేయబోతున్నామని చెప్పారు. పరిశ్రమల శాఖ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 15 శాతం అభివృద్ధి సాధించాలని నిర్దేశించామన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యం కూడా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్క్ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారని చెప్పారు. ఇప్పటివరకు 50 ప్రారంభించుకున్నామని తెలిపారు. ప్రైవేట్ ఎంఎస్ఎంఈ పార్కులను కూడా ప్రభుత్వం ప్రోత్సహించేందుకు ముందుకు వస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ... జిల్లాలో ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో 10,000 ఎకరాల భూమి అందుబాటులో ఉందన్నారు. ఇందులో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముచ్చుమర్రి నుండి నీటి సరఫరాకు సంబంధించి 80 శాతం పని పూర్తయిందన్నారు. రైల్వేలైన్ ఏర్పాటుకు కూడా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మూడు పెద్ద ప్రాజెక్టులు గ్రీన్ కో, జియో మైసూర్ (గోల్డ్ మైన్, పత్తికొండ), జైరాజ్ ఇస్పాత్ కంపెనీలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటుకు అనుకూల అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆయా కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించాలని పారిశ్రామికవేత్తలకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సూచించారు. అనంతరం కర్నూలు జిల్లా ఎంప్లాయిమెంట్ శాఖ తయారు చేసిన కర్నూల్ క్యారీర్స్ పోర్టల్‌ను మంత్రి టిజి. భరత్ ఆవిష్కరించారు. ఈ సదస్సులో జాయింట్ డైరెక్టర్ గిరిధర్, అలిప్ కంపెనీ రమాదేవి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, రాజా మహేంద్ర, రీజనల్ ఫైర్ ఆఫీసర్ భూపాల్ రెడ్డి, ట్రాన్స్కో ఎస్సీ ఉమాపతి, డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ ఆఫీసర్ జవహర్ బాబు, జెడ్ ఎం మధుసూదన్, డిడి మైన్స్ తదితర అధికారులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ.భరత్

లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు చూపాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ల స్థలాల పట్టాలకు వెంటనే స్థలాలు చూపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. సోమవారం ఓర్వకల్లు తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ఇంటి స్థలాల లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్ దేశాయ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇంటి స్థలాలు లేని నిరు పేదలకు ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇచ్చిందని, అయితే ప్లాట్లకు నెంబర్లు వేయకుండా, లబ్ధిదారులకు స్థలాలు చూప లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేకసార్లు మండల రెవెన్యూ అధికారులకు, తహశీల్దార్‌కి విన్నవించినా ఫలితం లేదని విమర్శించారు. దానికి తోడు గత రెండు మూడు నెలల క్రితం ఇంటి పట్టాలు ఇచ్చిన లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారన్నారు. ఇప్పటికైనా తహశీల్దార్ స్పందించి తక్షణమే ప్లాట్లకు నంబర్లు వేసి లబ్ధిదారులకు స్థలాలు చూపించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ విద్యాసాగర్‌కి వినతిపత్రం సమర్పించారు. తహశీల్దార్ స్పందిస్తూ నెలన్నర లోపు ఇంటి స్థలాల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న, మండల కమిటీ సభ్యులు టి.మల్లేష్, మండల నాయకులు పాల్గొన్నారు.


తహశీల్దార్ విద్యాసాగర్‌కు వినతిపత్రం సమర్పించి వివరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్

మహిళలు ఐక్యంగా ఉద్యమించాలి

- ఐద్వా జిల్లా కార్యదర్శి పి. నిర్మలమ్మ



మండల కమిటీ సభ్యులతో ఐద్వా జిల్లా కార్యదర్శి పి. నిర్మలమ్మ

ప్రజాశక్తి - పత్తికొండ

మహిళలపై జరుగుతున్న అరాచకాలపై మహిళలందరూ ఐక్యమై ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.నిర్మల పిలుపునిచ్చారు. పత్తికొండ పట్టణంలోని ఈశ్వర్ రెడ్డి భవనంలో మహిళా మండల కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఐద్వా జిల్లా కార్యదర్శి పి.నిర్మల, సిఐటియు జిల్లా నాయకులు గౌస్ దేశాయ్ హాజరై మాట్లాడారు. మహిళలపై అఘాయిత్యాలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో మానవ మృగాలు తాగుడుకు బానిసై మహిళలపై గృహహింస, వరకట్న వేధింపులకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను తక్షణమే ప్రభుత్వాలు అరికట్టాలని డిమాండ్ చేశారు. పార్టీలకతీతంగా మహిళలందరూ ఐకమై సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. సిఐటియు మండల కార్యదర్శి రవిచంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసన్న, బురుజులు పాల్గొన్నారు.

ఐద్వా మండల కమిటీ ఎన్నిక...

పత్తికొండ ఐద్వా మండల అధ్యక్షురాలుగా అంజనమ్మ, ఉపాధ్యక్షురాలుగా జైలమ్మ, కార్యదర్శిగా కృష్ణవేణి, ఉపాధ్యక్షురాలుగా ఉమామహేశ్వరి, సహాయ కార్యదర్శిగా పావని, ఉపాధ్యక్షురాలుగా లక్ష్మమ్మ, సహాయ కార్యదర్శిగా లలిత, ఉపాధ్యక్షురాలుగా రాఘవేంద్రమ్మలను ఎన్నుకున్నారు. అలాగే కమిటీ సభ్యులుగా చిట్టెమ్మ, భారతి, సుంకమ్మలను ఎన్నుకున్నారు.

గరికపాటి స్ఫూర్తితో ప్రజా కళలను ముందుకు తీసుకెళ్దాం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రజా కళాకారుడు ప్రజానాట్యమండలి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గరికపాటి రాజారావు స్ఫూర్తితో ప్రజాకళలను మరింత ముందుకు తీసుకెళ్దామని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈ.రాజు తెలిపారు. సోమవారం నగరంలోని కార్మిక, కర్షక భవన్ వద్ద ఉన్న పిఎన్ఎం జిల్లా కార్యాలయంలో రాజారావు వర్ధంతి నిర్వహించారు. పిఎన్ఎం జిల్లా సహాయ కార్యదర్శి పి.నోమేశ్వరి అధ్యక్షత వహించారు. ముందుగా రాజారావు చిత్రపటానికి విశ్వ కళా సమితి అధ్యక్షులు బీసన్న, ట్రెజరర్ కేసన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిఎన్ఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షులు లోకేష్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాఘవేంద్ర, సాయిఉదయ్ మాట్లాడారు. నేటి సమాజంలో కల ద్వారానే ప్రజలను మరింత చైతన్యం చేసే విధంగా గరికపాటి రాజారావు స్ఫూర్తితో మరింత చైతన్యవంతంగా కృషి చేస్తుందని తెలిపారు. డివైఎఫ్ఐ న్యూ సిటీ కార్యదర్శి హుస్సేన్ బాష, పిఎన్ఎం నాయకులు రాంబాబు, సుంకన్న, సుబ్బరాయుడు, సరిత, లక్ష్మి, రామకృష్ణ, గురిగింజ నాగరాజు, విజయ్, దామోదర్ పాల్గొన్నారు. **పత్తికొండ** పట్టణంలోని కామ్రేడ్ ఈశ్వర్ రెడ్డి భవనంలో రాజారావు చిత్రపటానికి సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. వ్యకాస మండల అధ్యక్షులు, కార్యదర్శి జై సింహ, బుజ్జులు, ఆటో యూనియన్ నాయకులు ప్రభాకర్, పిఎన్ఎం జిల్లా నాయకులు కాశన్న, మండల కార్యదర్శి రమేష్, సిఐటియు మండల కార్యదర్శి రవిచంద్ర పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

'బిర్లా'లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



ఆకట్టుకున్న విద్యార్థుల కళారూపాలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నన్నూరులోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో విద్యార్థులు పద్యాలు, ప్రసంగాలు, పాటలు, స్కిట్స్ ప్రదర్శించి తెలుగు భాష గొప్పతనాన్ని ప్రతిభింబించారు. తల్లిభాష పట్ల గౌరవం, భాషా సంరక్షణ అవసరాన్ని వివరించారు. అనంతరం నృత్యాలు, పాటలు, ప్రసంగాల ద్వారా ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించారు. ప్రిన్సిపల్ ఎ. కాదంబరి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున్‌లు మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషిని అభినందిస్తూ, ఉపాధ్యాయుల పట్ల గౌరవం, మాతృభాష పట్ల మమకారం ప్రతి ఒక్క విద్యార్థిలో పెంపొందాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాటకాలు చాలు..!

- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ఉల్లి ధరలపై వైసిపి నాయకులు చేస్తున్న డ్రామాలు ఆపాలని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, మల్లెల రాజశేఖర్, టిడిపి సీనియర్ నాయకులు, కెడిసిసిబి చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టిడిపి నాయకులు కెవి.సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైసిపి మోసపూరిత వాగ్దానాలను నమ్మి ప్రజలు అవకాశమిస్తే రాష్ట్రాన్ని నాశనం చేశారని, వారి నాటకాలను గ్రహించి కేవలం 11 సీట్లకే పరిమితం చేశారని తెలిపారు. సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామంలో వైసిపికి చెందిన గుండ్లకొండ కృష్ణ, గుండ్లకొండ వెంకటనాయుడు మద్యం సేవించగా గ్రామంలోని వైసిపి నాయకుడు ఖాళీ క్రిమిసంహారక మందు డబ్బాలో మద్యం పోయించి ఉల్లి పంటకు గిట్టుబాటు ధర లేనందున ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో తీయించి, 108కు ఫోన్ చేయించి, సోషల్ మీడియాలో ప్రచారం చేయించారని విమర్శించారు. వారిని ఆస్పత్రిలో చేర్పించగా వారు క్రిమిసంహారక మందు సేవించలేదని, కేవలం మద్యం మాత్రమే సేవించారని వైద్యులు ధ్రువీకరించారని చెప్పారు. ఉల్లి రైతుల కష్టాలను తెలుసుకొన్నందువల్లనే వారికి గిట్టుబాటు ధరను నిర్ణయించి రైతుల నుంచి ఉల్లిని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. టిడిపి నాయకులు బేతం కృష్ణుడు, హనుమంతరాయ చౌదరి, సంజీవమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిక్కారెడ్డి, నాయకులు

భూ రీసర్వేలో అవకతవకలు

- మాజీ జడ్‌పిటిసి వెంకట్రామిరెడ్డి

ప్రజాశక్తి - సిబెళగల్

కొత్తకోట పంచాయతీలో చేపట్టిన భూరీసర్వేలో భారీగా అవకతవకలు జరిగాయని మాజీ జడ్‌పిటిసి వెంకట్రామి రెడ్డి తెలిపారు. సోమవారం తహశీల్దార్ వెంకట లక్ష్మికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ... సర్వే 461/సిలో విజయ, అమరజ్యోతి, మనోహర్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, నరేంద్ర రెడ్డికి 3.60 ఎకరాలు మాత్రమే ఉండగా 5.02 ఎకరాలు ఉన్నట్టు రీ సర్వేలో సృష్టించారన్నారు. అలాగే 461 సర్వే నెంబర్ తమ రెవెన్యూ పరిదిలోనే లేదని అడ్డంగా సృష్టించి రవీంద్ర రెడ్డికి 995 ఎల్‌పిఎంతో, అమరజ్యోతికి 2927 ఎల్‌పిఎంతో, మనోహర్ రెడ్డికి 2926 ఎల్‌పిఎంతో 32 సెంట్ల చొప్పున తయారు చేశారని తెలిపారు. 461ఎలో కె.రాజేశ్వరి 2.34 ఎకరాలుండగా 461/బిలో కె.మనోహర్ రెడ్డికి 2.34 ఎకరాలుండగా ఇద్దరికీ 867తో ఒకే ఎల్‌పిఎం నెంబర్ ఇవ్వడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. తహశీల్దార్ వెంకట లక్ష్మి మాట్లాడుతూ... ఎకరాకు ఐదు సెంట్లు ఎక్కువ గాని, తక్కువ గాని కొలతల్లో సహజమని పేర్కొన్నారు. మండలంలో 3,783 రైతు ఖాతాలున్నాయని, కొత్తగా 6704 ఎల్‌పిఎం నంబర్లు అందుబాటులోకి వచ్చాయని అవగాహన అవసరమని తెలిపారు. రీ సర్వే త్వరలో పూర్తవుతుందని, అవకతవకలపై అపోహలు వీడాలన్నారు. మండల సర్వేయర్ నాగభూషణం పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న మాజీ జడ్‌పిటిసి వెంకట్రామిరెడ్డి

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి : జెసి

ప్రజాశక్తి - కర్నూల్ కలెక్టరేట్

అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా సమస్యలను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జెసి ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.. పిజిఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను అలసత్వం వహించకుండా పెండింగ్ లో లేకుండా ఎప్పటికపుడు చూడాలన్నారు. డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం హర్షణీయం

కర్నూలు కార్పొరేషన్ : గ్రంథాలయంలో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం హర్షణీయమని గ్రంథాలయ పర్సన్ ఇన్‌ఛార్జీ, జెసి డాక్టర్ బి.నవ్య తెలిపారు. గ్రంథాలయంలో చదువుకొని టీచరు, గ్రూపు ఉద్యోగాలు పొందిన విద్యార్థులను సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ ఆధ్వర్యంలో జెసి డాక్టర్ నవ్య కర్నూలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రశంసించారు. ఆమె మాట్లాడారు. విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలను చదివి మంచి ఉన్నత దశకు చేరుకోవాలని ఆకాంక్షించారు. డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క, అసిస్టెంట్ లైబ్రేరియన్ గోవిందరెడ్డి, లైబ్రేరియన్లు ఎస్.బాషా, పద్మావతమ్మ, నసీమాబీ, రేణుక, ఉమా, నాగ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ ఎన్.మగ్బుల్ బాష, సుదర్శనం, రాజు పాల్గొన్నారు.


ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను అభినందిస్తున్న జెసి నవ్య


తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

పెద్ద చెరువు సమస్యను పరిష్కరించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు - ఆదోనిలో బైక్ ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని మండలం పాండవగల్లు గ్రామంలో హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న సర్వే నెంబర్ 135లో 20 ఎకరాల పెద్ద చెరువు సమస్యను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు కోరారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో పాండవగల్లు గ్రామం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చెరువు సమస్యపై ఇచ్చిన హామీని పరిష్కరించాలని, అధికారులు కూడా పెద్ద చెరువు సమస్యను ప్రత్యేకంగా చూడాలని కోరారు. ఇది ఐదు గ్రామాల ప్రజలకు సంబంధించిన సమస్య అని తెలిపారు. ఎమ్మెల్యే అన్ని అంశాలను అసెంబ్లీలో ప్రస్తావించిన, పెద్ద చెరువు సమస్యపై మాట్లాడలేదని విమర్శించారు. ఇప్పటికైనా దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని, లేకపోతే గ్రామంలోకి రాకుండా ఎమ్మెల్యేను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈనెల ఆఖరులోపు రెవెన్యూ అధికారులు కోర్టుకు వెళ్లి కేసు పూర్తిగా తెలియజేయాలని, లేకపోతే తహశీల్దార్ కార్యాలయం ముందు నిరాహార దీక్షలు చేపట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ... ఈ నెలలో పెద్ద చెరువు కేసు సమస్యపై హైకోర్టుకు వెళ్తామని హామీ ఇచ్చారు. సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న, మండల కార్యదర్శి వర్గసభ్యులు జె.రామాంజనేయులు, మండల కమిటీ సభ్యులు పాండురంగ, శాఖ కార్యదర్శులు గోవింద, హనీఫ్ బాషా, పార్టీ సభ్యులు కృష్ణ, హనుమంతు రెడ్డి, కె.నర్సిరెడ్డి, తాయన్న, భీమాంజనేయులు, కె.హనుమంతు రెడ్డి, నాగరాజు, రమేష్, కొండయ్య పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


ఎమ్మిగనూరులో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉచిత బస్సు వల్ల నష్టపోయిన ఆటో కార్మికులకు నెలకు రూ.12 వేలు ఇచ్చి ఆదుకోవాలని సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి, తహశీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వల్ల ఆటో కార్మికుల కుటుంబాలు పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగులు ఉపాధి లేక కుటుంబ పోషణ కోసం ఫైనాన్స్ ద్వారా అప్పులు తెచ్చుకొని ఆటోలు నడుపుతున్నారని తెలిపారు. ఆటో కార్మికులకు నెలకు రూ.12 వేలివ్వాలని, పెండింగ్‌లో ఉన్న 2024-25 వాహన మిత్ర పథకం డబ్బులు ఇవ్వాలని కోరారు. ఆటో యూనియన్ నాయకులు శ్రీరాములు, ఆదామ, సోమేశ్వర నాయుడు, రాజు, నాగార్జున గౌడ్, శంషాద్, మహాలింగ, రామాంజి, కల్యాణ్, పీరా సాబ్, శ్రీను పాల్గొన్నారు. **కోసిగి** తహశీల్దార్ కార్యాలయం ముందు ఎపి ఆటో ట్రాలీ డ్రైవర్ యూనియన్ (సిఐటియు) మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల కన్వీనర్ రాముడు, రైతు సంఘం నాయకులు వీరేష్, ఆటో యూనియన్ నాయకులు నేలకోసిగి ఆంజనేయులు, కొండగేని నాగరాజు, మురళీ, అమీర్, వెంకటేష్, రామాంజనేయులు, బాబు, ఉసేని, రాముడు, ఎంకప్ప, ఎల్లప్ప, రామకృష్ణ, ఎల్లయ్య, ఈరన్న, నరసింహులు, ఎల్లప్ప, ఈరన్న, శీను, వీరారెడ్డి, రాము, అయ్యన్న పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


ఆదోనిలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

మండలంలోని ఆరెకల్ గ్రామంలో నానో యూరియా క్షేత్ర ప్రదర్శన, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ కలిసి సోమవారం నానో యూరియా ఉపయోగంపై అవగాహన కల్పించారు. ఎఒ సుధాకర్, ఉద్యాన శాఖ అధికారి రఘువరన్ మాట్లాడారు. నానో యూరియా వాడకం వల్ల మొక్కకు పోషకాలు ఎక్కువ మోతాదులో అందుతాయని, ఖర్చు తక్కువగా, పర్యావరణ కాలుష్యం తక్కువగా ఉంటుందని తెలిపారు. నానో యూరియాను ఎంపిక చేసిన కలుపు మందులతో కలిపి పిచికారి చేయవచ్చని చెప్పారు. ఇది ద్రవరూపంలో లభిస్తుందని, పంటలపై పిచికారి రూపంలో స్ప్రే చేసుకోవచ్చని తెలిపారు. ఒక లీటరు నానో యూరియా బాటిల్ ఒక సాధారణ యూరియా బస్తాతో సమానమని చెప్పారు. వ్యవసాయ విస్తరణ అధికారి పి.సతీష్, గ్రామ వ్యవసాయ సహాయకులు రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు. **కోసిగి** మండలం అగసనూరు గ్రామంలో ఉన్న రైతులకు ఎఒ వరప్రసాద్ నానో యూరియాపై అవగాహన కల్పించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు హనుమంత నాయక్ , రైతులు పాల్గొన్నారు.

ఛైర్మన్ గిరి ఎవరిదో..?

- గ్రూపు పోరులో 'పీఠం' కోసం మూడు ముక్కలాట..!

నియోజకవర్గంలో ఏకైక నామినేటెడ్ పదవి శ్రీలక్ష్మి నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పాలక మండలి అధ్యక్ష పీఠం. పాలకమండలి నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడంతో తెలుగు తమ్ముళ్లలో ఆశలు చిగురించాయి. అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోగా, దేవాదాయ శాఖాధికారులు పరిశీలించి శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపించారు. ఈ అధ్యక్ష పీఠం కోసం తీవ్ర పోటీ నెలకొంది.





ప్రజాశక్తి - కౌతాళం

నియోజకవర్గంలో టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, ఇన్‌ఛార్జి రాఘవేంద్ర రెడ్డి మధ్య గ్రూపు పోరు నడుస్తోంది. ఈ పోరులో ఛైర్మన్ పీఠం ఎవరు దక్కించుకుంటారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. తిక్కా రెడ్డి గ్రూపు నుంచి చెన్న బసప్ప, కొట్రేష్ గౌడ్, టిడిపి ఇన్‌ఛార్జి రాఘవేంద్ర రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు గోతులదొడ్డి ఉల్లిగయ్య గ్రూపు నుంచి వల్లూరు నాగేశ్వరరావు, మంత్రి టిజి.భరత్ కుటుంబం నుంచి టిజి.పాండురంగయ్య శెట్టితో పాటు రమాకాంత్ రెడ్డి ఛైర్మన్ పదవి కోసం పోటీలో ఉన్నారు. ముగ్గురి మధ్య తీవ్ర పోటీ ఉండడంతో కూటమి ప్రభుత్వంలో మూడు ముక్కలాట మొదలైంది..! ఈ అధ్యక్ష పీఠం కోసం టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉండే టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు, మాజీ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ చెన్నబసప్ప మరో అవకాశం కోసం బరిలో దిగారు. ఈయన సీనియర్ నాయకునిగా పార్టీ అభివృద్ధికి పనిచేశారు. కౌతాళంలో ఎంతో విలువైన సొంత స్థలాన్ని ఆర్‌టిసి బస్టాండ్, పోలీసు స్టేషన్‌కు కేటాయించి స్థల దాతగా పేరుగాంచారు. గ్రూపు పోరులో తిక్కారెడ్డి వైపు నిలబడ్డారు. అన్ని వర్గాల దేవాలయాల అభివృద్ధి కోసం తన వంతు సహకారాలు అందిస్తున్నారు. ఇదే గ్రూపు నుంచి ఉరుకుంద గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కొట్రేష్ గౌడ్ కూడా ఈ పదవిని ఆశిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఉరుకుంద గ్రామానికి చెందిన నాగరాజ్ గౌడ్‌కు ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ పదవి దక్కడంతో, ఈసారి కూటమి ప్రభుత్వం స్థానికులకే పదవి కట్టబెట్టాలని స్థానిక నాయకులు డిమాండ్ చేస్తున్నారు. నియోజకవర్గంలో సీనియర్ నాయకులు గోతులదొడ్డి ఉల్లిగయ్యకు నమ్మిన బంటు, పార్టీ కష్టకాలంలో కూడా ఉల్లిగయ్య వెంటనే ఉండి పార్టీ అభివృద్ధికి వల్లూరు నాగేశ్వరరావు పనిచేసింది. టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీలో ఉండే వాల్మీకి నాయకులు ఉల్లిగయ్య కుటుంబం కౌతాళం మండలం టిడిపికి కంచుకోటగా మార్చారు. ఈయన మద్దతుతో ఛైర్మన్ పదవి కోసం నాగేశ్వరరావు పోటీలో నిలబడ్డారు. నాగేశ్వరరావుకు ఛైర్మన్ పదవి రావడానికి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ నాయుడు కృషి చేస్తున్నారు. మంత్రి టిజి.భరత్ కుటుంబానికి చెందిన టిజి.పాండురంగయ్య శెట్టి ఛైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. పాండురంగ శెట్టిని ఛైర్మన్ పీఠంపై కూర్చోబెట్టడానికి మంత్రి టిజి.భరత్ చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. దేవస్థానం అభివృద్ధి కోసం పాలకమండలి పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఏ పార్టీ అధికారంలో ఉన్నా కౌతాళం మండలానికి చెందిన నాయకులకే పాలకమండలి పీఠం దక్కింది. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పార్టీ అభివృద్ధికి కష్టపడే వారికి పదవులు కేటాయిస్తూ వచ్చాయి. ప్రస్తుతం ఉరుకుంద క్షేత్రం అసిస్టెంట్ కమిషనర్ హోదా నుంచి డిప్యూటీ కమిషనర్ హోదాలో ఉంది. కూటమి ప్రభుత్వం రాజకీయ రంగస్థలంలో ఛైర్మన్ పీఠంపై ఎవరు కూర్చుంటారో..? టిడిపి అధిష్టానం ఆశీస్సులు ఎవరికి అందుతాయో వేచి చూడాల్సిందే..!

సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు

ప్రజాశక్తి - నందవరం


పనులు చేయిస్తున్న పెద్ద ఎల్లప్ప

సొంత నిధులతో కొట్టాల రోడ్డు మరమ్మతు పనులను జనసేన పార్టీ మండల అధ్యక్షులు పెద్ద ఎల్లప్ప చేపట్టారు. సోమవారం ఆయన మాట్లాడారు. మండలంలోని కొట్టాల గ్రామం రోడ్డు గుంతలు పడి అధ్వానంగా ఉందని, ఇబ్రహీంపురం, యాన, కొట్టాల ప్రజలు పూలచింత గ్రామానికి రాకపోకలు సాగియించేందుకు ఈ రోడ్డు అనుకూలంగా ఉందని తెలిపారు. ఈ మార్గం రైతులు పొలాలకు వెళ్లేందుకు ప్రధానమైందని, సురక్షత మంచినీరు పాయింట్‌కు వెళ్లాలన్నా ఇలాగే వెళ్లాలని చెప్పారు. గ్రామానికి ముఖ్యమైన మార్గం గుంతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వారి కష్టాలను తీర్చేందుకు మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. రూ.10 వేల వ్యయంతో గ్రావెల్ వేయించినట్లు తెలిపారు. చాలా కాలం నుంచి దుర్భరమైన రోడ్డుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, మరమ్మతులు చేపట్టి పెద్ద ఎల్లప్ప సమస్యను పరిష్కరించడం హర్షించదగ్గ విషయమని ప్రజలు తెలిపారు.

అంగన్వాడీ కేంద్రం-2లో చోరీ

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరిలోని అంగన్వాడీ కేంద్రం-2లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. తాళాలు పగులగొట్టి 25 కిలోల బేడలు, రెండు ఆయిల్ బాక్సులు ఎత్తుకెళ్లారని, కోడిగుడ్లను కూడా పగులగొట్టినట్లు అంగన్వాడీ టీచర్ నాగేంద్రమ్మ తెలిపారు. సోమవారం ఈ సంఘటన వెలుగులోకి రాగా, ఐసిడిఎస్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ రాజు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల ఆలయాలు, ఇళ్ల దగ్గర ఆపిన మోటార్ సైకిళ్ల, ఇప్పుడు అంగన్వాడీ కేంద్రాలు దొంగలకు లక్ష్యంగా మారాయి. పోలీసు గస్తీని ముమ్మరం చేయాలని, దొంగతనాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'అక్షరాస్యతతోనే అభివృద్ధి'

ప్రజాశక్తి- దేవనకొండ

ప్రతి ఒక్కరూ అక్షరాస్యులుగా మారినప్పుడే అభివృద్ధి చెందుతారని గ్రంథాలయాధికారి ఎస్.శ్రీనివాసులు తెలిపారు. సోమవారం దేవనకొండ గ్రంథాలయంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞాన సుధ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులతో పుస్తక పఠనం నిర్వహించారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వంద మందికి హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఫర్ పీపుల్ ఎన్విరాన్‌మెంట్ (హోప్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఎంఇఒ-2 నీలకంఠ చేతుల మీదుగా క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, పీడీ జాకీర్ హుస్సేన్, సంస్థ అధ్యక్షులు హెచ్‌కె.ఖాజా బందే, ప్రతినిధులు చాంద్ బాషా, షఫీ, రస్త నబి పాల్గొన్నారు.

కష్టపడిన వారికి సముచిత స్థానం

- జనసేన పార్టీ ఇన్‌ఛార్జీ లక్ష్మన్న

ప్రజాశక్తి - మంత్రాలయం

పార్టీ బలోపేతానికి కష్టపడిన ప్రతి ఒక్కరికీ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ సముచిత స్థానం కల్పిస్తారని నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బి.లక్ష్మన్న పేర్కొన్నారు. కూటమి ఒప్పందం ప్రకారం పార్టీ తరపున పదవులు పొందిన వారిని, పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుక విజయవంతంలో ప్రముఖ పాత్ర వహించిన వారిని సోమవారం ఆయన స్వగృహంలో సన్మానించి అభినందించారు. పెద్దకడుబూరులో సింగిల్ విండో డైరెక్టర్‌గా ఎన్నికైన హనుమేష్, కోసిగి మార్కెట్ యార్డు డైరెక్టర్లుగా ఎన్నికైన కోసిగి సి.వీరారెడ్డి, కుంటనహాలు హాజీ మల్లంగ్ బాబాలతో పాటు పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం, సభ విజయవంతంగా నడిపిన మండలాల అధ్యక్షులు సి.వీరారెడ్డి, జి.బజారప్ప, సుమిత్ర, బీవీ.రవిచంద్రను సన్మానించారు.

విరాళాలతో గుంత పూడ్చివేత

ప్రజాశక్తి - కోసిగి

గ్రామంలోని మెయిన్ రోడ్డు గుండా ఉన్న భారీ గుంతలు, పంచాయతీ కార్యాలయం ముందు, అంబేద్కర్ సర్కిల్, మెయిన్ రోడ్డుపై ఉన్న గుంతలను సోమవారం విరాళాలతో పూడ్చారు. సిపిఐ, ప్రజాసంఘాలు, ఎఐఎస్ఎఫ్, రైతుసంఘం, ఎఐటియుసి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సర్కిల్ నుంచి మెయిన్ రోడ్డు గుండా ఉన్న షాపుల వద్ద విరాళాలు సేకరించి గుంతలను పూడ్చారు. సిపిఐ మండలం కార్యదర్శి ఎం.గోపాల్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.ఈరేష్, రైతుసంఘం మండల అధ్యక్షులు తాయన్న, నాయకులు నరసింహులు, శ్రీనివాసులు, ఎఐటియుసి నాయకులు లక్ష్మన్న, ఎఐఎస్ఎఫ్ మండల నాయకులు దేవేంద్ర, వీరేంద్ర, కృష్ణ, కృష్ణమూర్తి, మల్లికార్జున, మాబాష, వన్నూర్ వలీ పాల్గొన్నారు.

'ఉపాధి వేతనాలు చెల్లించాలి'

ప్రజాశక్తి - హొలగుంద

నాలుగు వారాల ఉపాధి కూలిలు చెల్లించే వరకు పోరాటాలు నిర్వహిస్తామని సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు బి.మునిస్వామి తెలిపారు. సోమవారం సిపిఐ ఎంఎల్ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. మల్లమ్మ, ప్రకాష్, శివ కుమార్, గాదిలింగ పాల్గొన్నారు.


సన్మానం చేస్తున్న సభ్యులు

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది

- ఎంఇఒలు ఆంజినేయులు, రాజారామ్మోహన్

- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రిన్స్ సేవా సమితి ఘన సన్మానం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని ఎమ్మిగనూరు ఎంఇఒ ఆంజినేయులు, పత్తికొండ ఎంఇఒ రాజారామ్మోహన్ తెలిపారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రిన్స్ స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జూనియర్ కళాశాలలో సన్మానం చేశారు. పట్టణానికి చెందిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు నాగేంద్ర కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహరాజు, దోర్నాల శ్రీనివాసులతో పాటు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్-19 విభాగంలో కర్నూలు, నంద్యాల జిల్లాలకు కార్యదర్శిగా ఎన్నికైన కమ్మరి రాఘవేంద్రను ఎంఇఒలు ప్రిన్స్ సేవా సమితి అధ్యక్షులు వహాబ్, బార్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యులు, ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వాల్మీకి రామకృష్ణ నాయుడు చేతుల మీదుగా శాలువా, పూలమాలతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉత్తమ సేవలు అందించినప్పుడు ఉపాధ్యాయులకు తగిన గుర్తింపు లభిస్తుందని కొనియాడారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని కోరారు. ప్రతి వ్యక్తికి తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుదేనని పేర్కొన్నారు. సన్మాన గ్రహీతలు నరసింహ రాజు, రాఘవేంద్ర, కుమార్, శ్రీను మాట్లాడారు. సమాజంలో ఎన్నో సేవలందిస్తున్న వహాబ్ బాష అలియాస్ ప్రిన్స్ వహాబ్‌ను ప్రత్యేకంగా కొనియాడారు. జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ లుక్మాన్, వైఎఫ్‌సి కోచ్ మాబుసాబ్, ప్రధానోపాధ్యాయులు నాగరాజు, శ్రీధర్, ఎన్ఐఎస్ సభ్యులు ఈరన్న, పిఇటిలు వెంకటేష్, లతీఫ్, బసవరాజు, శ్రీరామ్, అథ్లెటిక్ కోచ్ మల్లి, కరుణాకర్ రెడ్డి, అంజి పాల్గొన్నారు.

రైతన్నకు బాసటగా వైసిపి

- నేడు 'అన్నదాత పోరు'ను జయప్రదం చేయండి
- మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రైతులకు బాసటగా వైసిపి నిలబడుతుందని, రైతులకు అండగా వైసిపి ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టనున్న 'అన్నదాత పోరు'కు రైతులు తరలిరావాలని ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి కోరారు.


ఆదోనిలో మాట్లాడుతున్న సాయి ప్రసాద్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి

సోమవారం మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డిని, ఎమ్మిగనూర్ మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తనయుడు జగన్మోహన్ రెడ్డి సాయి ప్రసాద్ రెడ్డి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. 'అన్నదాత పోరు' విజయవంతంపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో గతేడాది అతివృష్టి, అనావృష్టితో రైతులు నష్టపోయారని, వర్షాభావ పరిస్థితులతో పంటలన్నీ దెబ్బతిన్నాయని తెలిపారు. పెట్టుబడి కూడా రాలేదని, ప్రభుత్వం ఆదుకోలేదని విమర్శించారు. 'అన్నదాత పోరు'లో భాగంగా ఆదోనిలోని వైసిపి కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి ఆదోని సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. తాను, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి, ఎమ్మిగనూరు ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. **చిప్పగిరి** గోవిందప్ప స్వామి ఆవరణలో వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య ఆధ్వర్యంలో 'అన్నదాత పోరు' గోడపత్రికను విడుదల చేశారు. పత్తికొండ ఆర్‌డిఒ కార్యాలయం ముట్టడి చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం ఉపాధ్యక్షులు ఓబులేసు, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి ఉనేబాది మల్లికార్జున, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, నియోజకవర్గ డాక్టర్ల విభాగం అధ్యక్షులు బెల్డోన రామచంద్ర, జయరాముడు, సూరి, లోకన్న, బంటనహాల్ రమేష్, సంగాల శేఖర్, మునిస్వామి, రైతులు పాల్గొన్నారు. **ఆస్పరి**లోని గాంధీ పార్కులో 'అన్నదాత పోరు' గోడపత్రికలను విడుదల చేశారు. వైసిపి మండల కన్వీనర్ బసవరాజు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మహానంది, సొసైటీ మాజీ ఛైర్మన్లు గోవర్ధన్, నరసింహులు, యూత్ విభాగం జిల్లా కార్యదర్శి ప్రకాష్, తాలూకా అధ్యక్షులు అశోక్, ఎంపిటిసి రాధాకృష్ణ, వైసిపి నాయకులు లక్ష్మణ, ప్రకాష్, శివ, నాగన్న, నాయుడు, వీరేంద్ర, సందీప్, ఎల్లప్ప, హుస్సేని పాల్గొన్నారు.


చిప్పగిరిలో గోడపత్రికలను విడుదల చేస్తున్న నాయకులు

వైభవంగా పీఠాధిపతుల ఊరేగింపు

ప్రజాశక్తి - మంత్రాలయం

శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులను శ్రీమఠం అధికారులు, గ్రామస్తులు వైభవంగా ఊరేగించారు. సోమవారం చాతుర్మాస్య దీక్ష విరమణ చేసిన సందర్భంగా పీఠాధిపతులను మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం నుంచి శ్రీరామ సర్కిల్, రాఘవేంద్ర సర్కిల్ మీదుగా కొండాపురం వరకు ఊరేగించారు. సీమోల్లంఘన కార్యక్రమంలో భాగంగా గ్రామ పొలిమేరలో ఉన్న శ్రీకొండాపురం ఆంజనేయస్వామిని దర్శించుకొని దీక్ష విరమణ చేశారు. ముందుగా ఆర్యవైశ్య సత్రం వద్ద ప్రత్యేకంగా అలకరించిన వాహనంపై ఆశీనులు కాగా టిటిడి పాలక మండలి మాజీ సభ్యులు వై.సీతారామిరెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, వైసిపి నాయకులు గోర్కల్ కృష్ణస్వామి, జనార్ధన్ రెడ్డి, శివ కుమార్, కురువ మల్లికార్జున ఆధ్వర్యంలో పీఠాధిపతులకు పూలమాల, శాలువా సన్మానించారు. అనంతరం శ్రీమఠం ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పీఠాధిపతులకు రూపాయి నాణేలతో తులాబారం చేశారు. సిఐ రామాంజులు బందోబస్తు నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసులు రెడ్డి, మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, సీనియర్ నాయకులు పూజారి వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.


ఊరేగింపులో పాల్గొన్న నాయకులు

ఎమ్మెల్యే బీవీకి కృతజ్ఞతలు

- టిడిపి మండల ప్రధాన కార్యదర్శి దేవుళ్ల లచప్ప

ప్రజాశక్తి - నందవరం



టిడిపి మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన దేవుళ్ల లచప్ప ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆయన మాట్లా డారు. తనపై నమ్మకం ఉంచి పార్టీలో ఉన్నత స్థానం కల్పించారని ఆనందం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

'12న మెగా జాబ్ మేళా'

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 12న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జ్ఞానేశ్వర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు పది కంపెనీల అధికారులు వస్తున్నట్లు తెలిపారు. జిల్లా, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు హాజరై ప్రారంభిస్తారని చెప్పారు. 10వ తరగతి నుంచి డిగ్రీ విద్యార్హత గల అభ్యర్థులు సర్టిఫికెట్ జిరాక్స్‌లు, ఆధార్, రెండు ఫొటోలు తీసుకురావాలని తెలిపారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోనిలో వెలసిన శ్రీగంగాభవాని విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం సోమవారం కనుల పండువగా సాగింది. గంగా భవాని విగ్రహానికి, ఉత్సవమూర్తికి అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తిని పల్లకిలో ఉంచి ఊరేగింపు నిర్వహించారు. గంగపుత్ర సంఘం నాయకులు, తెలుగు ఈరన్న, ఆటో వెంకటేష్, మేఘనాథ్, బేల్దారు శ్రీనివాసులు, రాయచూర్ నగేష్, రామాంజనేయులు, కృష్ణ మూర్తి, దుల్లయ్య, మున్సిపల్ వీరేష్, సూర్య ప్రకాష్, టీచర్ రంగన్న, మైలప్ప ఈరన్న, మార్కెట్ ఈరన్న పాల్గొన్నారు.


గోడపత్రికను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

'రణభేరిని జయప్రదం చేయాలి'

ప్రజాశక్తి - ఆదోని

బోధనేతర పనులు అప్పగించి ఉపాధ్యాయులను మానసిక ఆందోళనకు గురిచేసే నిర్ణయాలను ప్రభుత్వం విరమించుకోవాలని కోరుతూ చేపట్టే రణభేరిని జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు కోరారు. సోమవారం రణభేరి గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలన్నారు. బకాయిలు చెల్లించాలని, సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈనెల 15 నుంచి 19 వరకు రణభేరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కౌన్సిల్ సభ్యులు రుద్రముని, రామన్న, సీనియర్ నాయకులు బసప్ప, కృష్ణుడు, పాపయ్య, ఉరుకుందు పాల్గొన్నారు.

'ఫిజియోథెరపీ'ని వినియోగించుకోవాలి

- ఫిజియోథెరపీ వైద్యులు జావీద్, అబ్దుల్ ఖాలిక్

ప్రజాశక్తి - ఆదోని

కీళ్లు, ఎముకల వ్యాధులతో మంచానికే పరిమితమైన వారు ఫిజియోథెరపీ వల్ల వ్యాధిని నయం చేసుకోవచ్చని, అలాంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ఫిజియోథెరపీ వైద్యులు జావీద్, అబ్దుల్ ఖాలిక్ తెలిపారు. సోమవారం ఆదోని లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గోపీనాథ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవం నిర్వహించారు. ఫిజియోథెరపీ వైద్యులను పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఫిజియోథెరపీ అనేది కీళ్లు, ఎముకలు, నరాల జబ్బులు ఉన్న వారికి చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎక్కువ రోజులు మంచానికి పరిమితమైన రోగులకు, వృద్ధులకు ఫిజియోథెరపీ ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఎముకలు, కీళ్ల ఆపరేషన్ల తర్వాత ఫిజియోథెరపీ చేయించుకోవడం వల్ల త్వరగా నయం చేయవచ్చని చెప్పారు. అవగాహన రాహిత్యం వల్ల కొందరు అనుభవం లేని వారిని సంప్రదించి రోగం ముదిరి ఇబ్బందులకు గురవుతున్నారని, వైద్యుల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షులు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్ గుప్తా, కోశాధికారి వనపరాజు, విశిష్ట సభ్యులు ఓం ప్రకాష్, నీల మోహన్, గోవిందరాజమూర్తి, జితేంద్ర, రవీంద్ర, రాజేంద్ర ఉన్నారు.


ఫిజియోథెరపీ వైద్యుని సన్మానిస్తున్న సభ్యులు

భర్తను హత్య చేయించిన భార్య : సిఐ

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని తొగలగల్లు గ్రామానికి చెందిన అహోబిలం (31)ను ప్రియుడు మోజులో పడి ప్రియుడితో కలిసి ఆయన భార్య హత్య చేయించినట్లు సిఐ గంగాధర్ తెలిపారు. ఈనెల 3న అహోబిలంను దొడకొండ గ్రామ సమీపంలో హత్య చేశారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని తొగలగల్లు గ్రామానికి చెందిన అహోబిలం కలపరి గ్రామానికి చెందిన గంగావతిని కొన్నేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నారని, వారికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారని తెలిపారు. కొన్నేళ్ల క్రితం దంపతులిద్దరూ కర్ణాటకలోని యాదగిరి జిల్లా రత్నడిగి గ్రామానికి పత్తి తీసేందుకు కూలి పనులకు వెళ్లారని చెప్పారు. అక్కడ బెంగళూరు నగరానికి చెందిన చెన్నబసవతో గంగావతి వివాహేతర సంబంధం పెట్టుకున్నారని, తమకు అడ్డు వస్తున్నారని భర్త అహోబిలంను కడతేర్చాలని ప్రియుడు చెన్న బసవతో కలిసి గంగావతి కుట్ర పన్నారని తెలిపారు. స్వగ్రామం తొగలగల్లు గ్రామానికి వచ్చిన అహోబిలం ఈనెల 3న ఉదయం తన భార్య స్వగ్రామం కలపరికి మోటార్ సైకిల్‌పై వెళ్లారని చెప్పారు. భార్యను అక్కడే వదిలి తొగలగల్లుకు వస్తుండగా అప్పటికే దొడగొండ గ్రామం వద్ద కాపు కాసిన చెన్నబసవ మోటార్ సైకిల్‌పై వస్తున్న అహోబిలంను పిడి బాకుతో దాడి చేసి హత్య చేశాడని తెలిపారు. 2న తన భర్త కలపరికి వస్తున్నారనే విషయాన్ని ప్రియుడికి గంగావతి తెలియజేశారని చెప్పారు. హత్యకు ఉపయోగించిన మోటార్ సైకిల్‌ను, పిడి బాకును, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్టు చేశామని తెలిపారు.


నిందితులను అరెస్టు చూపుతున్న సిఐ గంగాధర్

ఏళ్లుగా పరిష్కారం కాని సమస్య

- బాధితుడు వెంకటేష్

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా దరఖాస్తులు చేసుకుంటున్నా సమస్యలు పరిష్కారం కాలేదని బాధితులు ఎం.వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కె.రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అక్టోబర్ 2, 2009న తుంగభద్ర నది వరదల అనంతరం మాధవరం లక్ష్మి, రాముడు దంపతుల పేరుతో ప్రభుత్వ గృహం మంజూరయిందని, దానిలో మంగళి లక్ష్మి, ఆధార్ పేరుతో అనుసంధానం కావడం వల్ల లబ్ధిదారుల జాబితాలో మంగలి లక్ష్మి పేరును చూపిస్తోందని తెలిపారు. అసలు తాము ప్రభుత్వ గృహానికి దరఖాస్తు చేసుకోలేదని వాపోయారు. రేషన్, ఆధార్ కార్డులు వేర్వేరుగా ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వల్ల తమకు అన్యాయం జరిగిందని తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం, గృహ నిర్మాణ శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. సుమారు 16 ఏళ్లుగా ఎవరో చేసిన తప్పిదానికి తాము తిరుగుతున్నామని చెప్పారు. రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖాధికారులు లబ్ధిదారుల రేషన్ కార్డుకు వారి ఆధార్ కార్డును అనుసంధానం చేసి, తమ ఆధార్ కార్డు వేరు చేయడానికి తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. తహశీల్దార్, ఎఇ, డిఇ లాలీ కృష్ణయ్య స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన తహశీల్దార్ రమాదేవి మాటాలడుతూ... ఫిర్యాదును గృహ నిర్మాణ శాఖ ఎఇకి బదిలీ చేస్తామని చెప్పారు.


వినతిపత్రం అందజేస్తున్న బాధితుడు



శ్మశాన వాటికలో కంప చెట్లను తొలగించాలి

- మున్సిపల్ కమిషనర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

బుధవారపేట శ్మశాన వాటికలోని కంప చెట్లను తొలగించాలని సిపిఎం నగర కార్యదర్శి రాజశేఖర్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామకృష్ణ, నగర కమిటీ సభ్యులు బంగి పద్మావతి, మద్దిలేటి కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ విశ్వనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ... హిందూ శ్మశాన వాటికకు కూటమి ప్రభుత్వం రూ.70 లక్షలు ఖర్చు చేసినట్లు చెప్తున్నారని, కంప చెట్లు మాత్రం తొలగించలేదని, శ్మశాన వాటిక పరిస్థితి దయనీయంగా ఉందని తెలిపారు. స్మశాన వాటిక పాత ప్రహరీ గోడకు ప్లాస్టింగ్ చేసి సున్నం కొట్టిన పరిస్థితి ఉందని స్మశానంలో శవాలు పూడ్చిపెట్టి బయటకు వచ్చిన తర్వాత కాలకత్యాలు తీర్చుకునేందుకు నీళ్లు లేని పరిస్థితి ఉందన్నారు. శ్మశాన వాటిక లో కంప చెట్లు పెరిగి గుంతలు తీయలేని స్థితిలో ఉందని వాపోయారు. నిధుల దుర్వినియోగంపై ఉన్నతాధికారులతో దర్యాప్తు జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

30 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

12వ పిఆర్సి కమిషన్ను వెంటనే నియమించి, నిత్యావసర ధరల పెరుగుదలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు గోకారి డిమాండ్ చేశారు. సోమవారం కర్నూల్‌లోని సలాం ఖాన్ ఎస్‌టియు భవనంలో ముఖ్య నాయకుల సమావేశం రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యుడు బి.సుంకన్న అధ్యక్షతన నిర్వహించారు. గోకారి మాట్లాడుతూ పిఆర్‌సిపై ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణితో ముందుకు వెళుతున్నాయన్నారు. పెండింగ్లో ఉన్న 4 కరువు భత్యాలను మంజూరు చేయాలన్నారు. 11వ పిఆర్సి బకాయిలను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నారాయణ స్వామి, ఉల్తప్ప, మధుసూదన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

స్కంధ గార్డియ పార్కు స్థలాన్ని కాపాడాలి



ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మండలం పంచలింగాల గ్రామం సమీపాన ఉన్న స్కందా వెంచర్‌లోని పార్కు స్థలము దాదాపు రెండు ఎకరాల భూమిని కేటాయించిన స్థలాన్ని ఆక్రమణ కాకుండా కాపాడాలని ఆవాజ్ నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పి ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండి షరీఫ్ స్థానికులతో కలిసి జెసికి వినతి పత్రం సమర్పించారు. అక్రమణా నిర్మాణాలు తక్షణమే ఆపేటట్లు చర్యలను తీసుకోవాలని కోరారు. ఆ స్థలమును కాపాడడం కోసం అవసరమైతే పోలీసులకు ఆదేశాలను ఇవ్వాలన్నారు. స్పందించిన జెసి నవ్య మాట్లాడుతూ డిపిఒను పిలిపించి గంధ గార్డియ వెంచర్ స్థలంలో పర్యటించి అక్కడి సమస్యను తెలుసుకొని తక్షణమే పరిష్కరించాలని ఆక్రమణదారులపై పట్టణమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సతీష్ కుమార్, కే విజయ్, అబ్దుల్ రసూల్, ఎస్ కలాం, డిఎండి మసీద్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా కిడ్నీ స్టోన్స్ తొలగింపు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

బాధిత మహిళకు కిడ్నీ స్టోన్స్ విజయవంతంగా తొలగించినట్లు మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలు క్లస్టర్ హెడ్ డాక్టర్ వై.మహేశ్వర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. బాధితురాలు సుజాత తీవ్ర కడుపు నొప్పితో మెడికవర్ ఆస్పత్రికి వచ్చారని, డాక్టర్ అబ్దుల్ సమద్, కన్సల్టెంట్ యూరాలజిస్ట్ సంప్రదించి ఆమెకు సిటి స్కాన్ తియ్యగా, ఆమెకు కుడి వైపు పూర్తి స్టాగ్‌హార్న్ కేల్కులస్ (కిడ్నీ స్టోన్) 5.1 సెంటీమీటర్, అప్పర్ పోల్ కేల్కులస్ 1.6 సెంటీమీటర్‌గా గుర్తించినట్లు తెలిపారు. ఆమె బంధువులకు కౌన్సెలింగ్ ఇచ్చి రోగికి ఆపరేషన్ చేసినట్లు చెప్పారు. తమ వద్ద అనుభవజ్ఞులైన వైద్యులతో 24/7 గంటలూ అందుబాటులో ఉంటారని తెలిపారు.

రక్తహీనత, పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ముజఫర్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కల్లూరు అంగన్వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహార మాసోత్సవాల సందర్భంగా తల్లులకు, గర్భిణులకు రక్తహీనత, పోషకాహారంపై అవగాహన కల్పించారు. డెమో శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ... మహిళల్లో రక్తహీనతను గుర్తించడం, నివారణ చర్యలు తీసుకోవడం, సమతుల్య ఆహారం తీసుకోవడం గురించి వివరించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పద్మావతి, ఆరోగ్య కార్యకర్త మంజుల, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయులే కీలకం : ఎంఇఒ

ప్రజాశక్తి - పత్తికొండ

విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పాత్ర కీలకమని ఎంఇఒ-1 రామ్మోహన్ రావు తెలిపారు. సోమవారం మండలంలోని హోసూర్ గ్రామంలో సాంఘిక సంక్షేమ ఆదర్శ పాఠశాలలో ఎంఇఒ, గ్రామస్తులు బైరపు వీరభద్రి, బనగాని శ్రీనివాసులు, ఎంపిటిసిలు నెట్టేకల్లు, ఒడుగూరు కేశప్ప, వాకిటి రాహుల్, సాయినాథ్, లక్ష్మన్న, రాజేష్‌లు రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీత ఉపాధ్యాయులు జి.వినూతకు పూలమాల, శాలువా వేసి సన్మానించారు. ఆదర్శ పాఠశాలలో విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు వినూత కృషి చేశారని కొనియాడారు.

ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు అభినందన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఎస్ఎపి క్యాంపులో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కవితా దేవి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందడం పట్ల ఎపి మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ నగర అధ్యక్షులు శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి రాముడు, రామచంద్రారెడ్డి, నిర్మల్ కుమార్, ఉస్మాన్ బాష, నీలమణి, సుభద్రాదేవి సోమవారం అభినందనలు తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణ ఎక్సలెన్సీ అవార్డు, సత్కారం లభించినందుకు ఆమెను అభినందించారు.

ప్రజావాణికి 98 ఫిర్యాదులు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 98 ఫిర్యాదులు అందాయనిఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం నగరంలోని కొత్తపేటలో ఉన్న కర్నూలు టూ టౌన్ పోలీసు స్టేషన్ పక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన మాట్లాడారు. ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కర్నూలు డీఎస్పీ జె.బాబు ప్రసాద్, సిఐలు పాల్గొన్నారు.

పాత కక్షతోనే హత్య - ముగ్గురు నిందితుల అరెస్టు

- హత్యకు ఉపయోగించిన కత్తులు, స్కూటీ స్వాధీనం
- కర్నూలు డీఎస్పీ జె.బాబు ప్రసాద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి బాబు ప్రసాద్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు 1వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని రాధాకృష్ణ థియేటర్ సమీపంలోని మద్దియాన్‌కు మసీద్ వద్ద ఈనెల 1న షేక్ ఇజహర్ అహ్మద్‌కు హత్య చేశారని, పాత కక్షలే హత్యకు కారణమని కర్నూల్ డీఎస్పీ జె.బాబు ప్రసాద్ తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 1న షేక్ ఇజహర్ అహ్మద్ తన తండ్రి షేక్ గౌస్ నిసార్ అహ్మద్‌తో కలిసి మసీదులో నమాజ్ చేసుకున్నారని, మసీదు నుంచి బయటకు రాగానే నగరంలోని గనిగల్లికి చెందిన ఇమ్రాన్, ఇర్ఫాన్, షేక్ జాహీన్ అహ్మద్ అలియాస్ జహంగీర్, ఎస్ఎమ్‌డి.ఇర్ఫాజ్, యూసుఫ్‌లు కత్తులతో దాడి చేసి హత్య చేశారని చెప్పారు. ఈ నేపథ్యంలో షేక్ ఇజహర్ అహ్మద్‌ను కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందారని తెలిపారు. 1వ పట్టణ స్టేషన్‌లో కేసు నమోదు చేసి 1వ పట్టణ సిఐ ఎం.పార్థసారథి, కోడుమూరు సిఐ తబ్రేజ్, 2వ పట్టణ సిఐ నాగరాజ రావు, 1వ పట్టణ ఎస్ఐలు ఎం.తిక్కారెడ్డి, ఎంఎ.ఖాన్, సిబ్బంది బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారని చెప్పారు. సోమవారం నిందితులను కర్నూలు టౌన్ జొహరాపురం పక్కి మసీద్ వద్ద అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. మరో ఇద్దరు నిందితులు ఇమ్రాన్, యూసుఫ్‌లు పరారీలో ఉన్నారన్నారు. నిందితుల నుంచి మూడు కత్తులు, హోండా యాక్టీవా 3-జిడ్ల్యు స్కూటీని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసును త్వరగా ఛేదించినందుకు డీఎస్పీ జె.బాబు ప్రసాద్, పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు. 1వ పట్టణ సిఐ పార్థసారథి, పిసిఆర్ సిఐ శివశంకర్, కర్నూలు వన్ టౌన్ ఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులపై అక్రమ కేసులు పెడితే న్యాయ పోరాటం : వైసిపి లీగల్ సెల్

ప్రజాశక్తి - కోడుమూరు



జిల్లాలో రైతులపై అక్రమ కేసులు పెడితే వారి పక్షాన వైసిపి లీగల్ సెల్ న్యాయ పోరాటం చేస్తోందని జిల్లా ప్రధాన కార్యదర్శి మిరపకాయల ప్రభాకర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రజల హక్కులను కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని ఆయన మండిపడ్డారు. సి.బెలగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన రైతులు గుండ్లకొండ కష్ణ, గుండ్లకొండ వెంకట నాయుడుకు వైసిపి ముద్ర వేసి వారిపై కేసులు బనాయించడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. తప్పుడు కేసులు బనాయించి వేదించే దుష్ట సంప్రదాయానికి ఈ ప్రభుత్వం తెరదీసిందని, ప్రభుత్వం వెంటనే వారిపై కేసులు తొలగించాలని డిమాండ్ చేస్తున్నామని ఆయన అన్నారు. రైతులపై ప్రభుత్వం పార్టీ ముద్ర వేసి వేధించడం మంచిది కాదు రైతులపై అక్రమ కేసులు పెడితే సహించేది లేదని, రైతులపై అక్రమ కేసులు బనాయిస్తే జిల్లాలో రైతులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందని, గిట్టుబాటు ధర లేక ఆత్మహత్య ప్రయత్నాల కు పాల్పడిన రైతులను వేధించడం ఎంతవరకు న్యాయమని, రైతులకు గిట్టుబాటు ధర వచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలి. కర్నూలు మార్కెట్ యార్డులో జరుగుతున్న మోసాలపై దృష్టి పెట్టి అందుకు సంబంధించిన వారిపై కేసులు నమోదు చేయలేదు గాని గిట్టుబాటు ధర లేదని ఆత్మహత్య ప్రయత్నం చేస్తే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. ఈ తరహా వ్యవహారాలు పూర్తిగా విడనాడాలని, రైతుల పక్షాన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు.

బాలల రక్షణపై పోలీసులకు శిక్షణ అవసరం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి



సమావేశంలో మాట్లాడుతున్న కబర్ధి

ప్రజాశక్తి - కర్నూలు లీగల్

బాలల రక్షణ కేసులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అవసరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాలతో జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి.కబర్ధి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి బి.లీల వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు న్యాయ సేవా సదన్‌లో బాలల న్యాయం మరియు బాలల రక్షణ చట్టాల అమలుపై జిల్లా స్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయ మూర్తి కబర్ధి మాట్లాడుతూ పోలీసులు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, హెల్త్ డిపార్ట్మెంటు, రెవెన్యూ డిపార్ట్మెంట్, చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్లతో సమన్వయం చేసుకొని పిల్లల కేసులు త్వరగా పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. పోక్సో కోర్టు జడ్జి రాజేంద్ర బాబు మాట్లాడుతూ పిల్లలపై లైంగిక వేధింపుల కేసులను త్వరగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని పిల్లలు ద్వితీయ బాధితులుగా మారకుండా చూడాలని కోరారు. కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ పిల్లల ప్రయోజనాల కోసం అన్ని పోలీస్ స్టేషన్‌లలో ప్రత్యేక చైల్డ్ హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాలని కోరారు. జువేనైల్ జస్టిస్ బోర్డు జడ్జి అనిల్ కుమార్ మాట్లాడుతూ జువేనైల్ జస్టిస్ బోర్డు ముందు చట్టానికి విరుద్ధంగా ఉన్న పిల్లలు నిర్ణీత వ్యవధి లోగా హాజరపరిచేలా చూడాలని కోరారు. సమావేశంలో డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, సోషల్ వెల్ఫేర్ డిడి రాధిక, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జుబేదాబేగం, గవర్నమెంట్ అబ్జర్వేషన్ హెూం సూపరింటెండెంట్ హుస్సేన్ బాషా, డిస్టిక్ ఇమ్మునైజేషన్ ఆఫీసర్ నాగప్రసాద్, నంద్యాల అడిషనల్ డిఎంహెచ్ఓ శారద బాయి పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి : ఆర్‌యు వీసీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



ఇంజినీరింగ్ విద్యతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకున్నపుడే పోటీ ప్రపంచంలో అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ ఆచార్య వి.వెంకట బసవరావు తెలిపారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. విసి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులంతా యూనివర్సిటీలో గడిపే అమూల్యమైన సమయాన్ని సక్రమంగా వినియోగించుకొని జీవితంలో ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ దిశగా వర్సిటీ చేపట్టాల్సిన అన్ని చర్యలు చేపడుతుందన్నారు. వర్సిటీ కాలేజీలో కొత్తగా నెలకొల్పిన కంప్యూటర్ సైన్స్ ల్యాబుతోపాటు, ఏఐ ల్యాబులు విద్యార్థులకు ఎంతో ఉపకరిస్తాయన్నారు. అదేవిధంగా మిగతా విభాగాల ల్యాబుల్లో కూడా ఆధునిక సౌకర్యాలు సమకూరుస్తున్నామన్నారు. పరిశ్రమల్లో పనిచేయడానికి అవసరమైన నైపుణ్యాలను సాధించాల్సిన విధానాలను శ్రీరాయలసీమ ఆల్కలీస్ అండ్ అలైడ్ కెమికల్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు సోదాహరణంగా వివరించారు. సాంకేతిక విద్యలో మహిళల ప్రాధాన్యం మరింతగా పెరగాల్సిన అవసరముందని మహిళా శిశు సంక్షేమశాఖ స్టాండిగ్ కౌన్సిల్ జి.విజయలక్ష్మి తెలిపారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్ కుమార్ నాయుడు యూనివర్సిటీ కాలేజి ప్రిన్సిపాల్ ఆచార్య సివి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్



కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు సుధాకరప్ప

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 15న చేపట్టే చలో విజయవాడ కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొనాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నగర ఉపాధ్యక్షుడు కె సుధాకరప్ప కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం ముజఫర్ నగర్‌లో మట్టి పని కార్మికుల సమావేశం ఎం రామలింగం అధ్యక్షతన నిర్వహించారు. సుధాకరప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరిస్తామని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని వాగ్దానం చేశారని అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం అవుతున్న ఇంతవరకు కూటమి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదని తెలిపారు. కార్మికులంతా ఏకమై సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించే వరకు సంక్షేమ పథకాలు అమలు చేసే వరకు పోరాటాన్ని కొనసాగించాలని కోరారు. మట్టి పని కార్మికులు మద్దమ్మ, సుంకులమ్మ, లక్ష్మీదేవి, మరియమ్మ పాల్గొన్నారు.

కిమ్స్‌లో ఆధునాతన ఫిజియోథెరపీ విభాగం ప్రారంభం

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్



కిమ్స్ హాస్పిటల్ హరితం బ్లాక్‌లో ఆధునిక సాంకేతిక పరికరాలు, కొత్త సేవలతో ఫిజియోథెరపీ విభాగాన్ని అప్‌గ్రేడ్ చేసి సోమవారం ప్రారంభించారు. అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ విభాగాన్ని హాస్పిటల్ ఎండీ డాక్టర్ సుధాకర్, సీఓఓ డాక్టర్ సునీల్ సేపూరి, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ రాజేష్ ప్రారంభించారు. డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ పచ్చని చెట్ల మధ్య స్వచ్ఛమైన ఆక్సిజన్ వాతావరణంలో రీహాబిలిటేషన్, ఫిజియోథెరపీ సౌకర్యాలు ఉండటం వల్ల రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉందన్నారు. ఆధునిక సాంకేతిక పరికరాలతో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని అన్నారు. సిఓఓ డాక్టర్ సునీల్ సేపూరి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో ఎక్కడా లేని విధంగా ఫిజియోథెరపీ విభాగాన్ని ఏర్పాటు చేశామని, అలాగే చైల్డ్ డెవలప్‌మెంట్ యూనిట్ ద్వారా చిన్నారులలో మాటలు రాకపోవడం, చెవుడు, మూగతనం వంటి సమస్యలకు ఆధునిక చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. కన్సల్టెంట్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ అర్షద్ మాట్లాడుతూ అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా ఈ నెల 8 నుంచి 15 వరకు ఉచిత ఓపీ, ఫిజియోథెరపీ సేవలపై 50 శాతం రాయితీ, అలాగే సెప్టెంబర్ 16 నుంచి 30 వరకు ఓపీపై 20 శాతం, ఫిజియోథెరపీ సేవలపై 10 శాతం డిస్కౌంట్ అందిస్తున్నామని వెల్లడించారు.

లౌకిక వాదాన్ని కాపాడుదాం

- ఎస్‌డిపిఐ రాష్ట్ర కార్యదర్శి సుభాన్



మాట్లాడుతున్న సుభాన్

ప్రజాశక్తి - ఆదోని : స్వతంత్ర భారత దేశంలో లౌకికవాదాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఎస్‌డిపిఐ రాష్ట్ర కార్యదర్శి సుభాన్ తెలిపారు. సోమవారం ఎస్‌డిపిఐ ఆదోని కన్వీనర్ గౌస్ ఖాన్ ఆధ్వర్యంలో పట్టణంలో సంస్కృతి ఫంక్షన్ హాలులో సమావేశం నిర్వహించారు. సుభాన్, ఎస్‌డిపి కర్ణాటకలోని గుల్బర్గా జిల్లా అధ్యక్షులు మోసిన్, నంద్యాల అధ్యక్షులు ఫాజిల్ దేశాయి హాజరయ్యారు. ఈ సందర్భంగా సుభాన్ మాట్లాడారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల భాగస్వామ్యంతో పార్టీని బలోపేతం చేయాలని తెలిపారు. కన్వీనర్ గౌస్ ఖాన్, కోకన్వీనర్ సద్దాం హుస్సేన్, నాసిర్, జిలాన్, ఖాదర్ బాషా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర నాయకులు పి నిర్మలమ్మ

హక్కులు, ఉపాధి కోసం మహిళల ఉద్యమించాలి

- ఐద్వా రాష్ట్ర నాయకులు నిర్మల

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, మహిళా హక్కులను కాపాడాలని ఐద్వా రాష్ట్ర నాయకులు పి.నిర్మల డిమాండ్ చేశారు. ముజఫర్ నగర్‌లో ఐద్వా సమావేశం జె.లక్ష్మీబాయి అధ్యక్షతన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత గత పది సంవత్సరాల కాలంలో మహిళలపై హింస హత్యలు అత్యాచారాలు మహిళలపై దాడులు ఎక్కువైపోయాయని తెలిపారు. హిందుత్వం పేరుతో మహిళలను మతోన్మాదులుగా తయారు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలను పూర్తిగా అమలు చేయడం లేదన్నారు. అన్ని రకాల బస్సులలో ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళల ఉపాధి కోసం జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. సిఐటియు నగర కోశాధికారి సిహెచ్ సాయిబాబా, సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె.సుధాకరప్ప, ఐద్వా జిల్లా అధ్యక్షులు జి.ధనలక్ష్మి, కెవిపిఎస్ సుందరయ్య నగర్ కార్యదర్శి రామాంజనేయులు, ఐద్వా నాయకులు కె.నాగేశ్వరి పాల్గొన్నారు.

ఆక్సీజన్ కొనుగోలు అవకతవకలపై విచారణ జరిపించాలి

- ఆర్‌జిఎన్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ జిల్లా కమిటీ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆక్సీజన్ కొనుగోలులో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని ఆర్‌జిఎన్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ ఎపి ఇన్‌ఛార్జి విజయ్ కుమార్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నీలం సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఆజాద్‌లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగిన అవినీతి పట్ల రాష్ట్ర మంత్రి ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రయివేటు ఆస్పత్రులకు క్యూబిక్ మీటర్ రూ.13 కొనుగోలు చేస్తే, ప్రభుత్వ ఆస్పత్రిలో క్యూబిక్ మీటర్ రూ 30 కొనుగోలు చేయడంలో అంతర్యమేమిటో ఆస్పత్రి సూపరింటెండెంట్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ప్రభుత్వ ఆస్పత్రికి ఆక్సీజన్ సరఫరా చేసిన సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

కళా ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ఈ నెల 11న కర్నూలు మండలం బి.తాండ్రపాడు డైట్ కళాశాలలో సోమవారం కళా ఉత్సవ పోస్టర్‌ను డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ అయూబ్ హుస్సేన్ కళాశాల అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... కళా ఉత్సవం విద్యార్థుల ప్రతిభను వెలికితీసే వేదికగా మాత్రమే కాకుండా, వారి సృజనాత్మకత, సాంస్కృతిక విలువలను పెంపొందించే పండగగా నిలుస్తుందని తెలిపారు. సంగీతం, నృత్యం, నాటకం, చిత్రలేఖనం వంటి విభాగాల్లో విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించనున్నారని చెప్పారు. జిల్లావ్యాప్తంగా 9, 10, 11, 12వ తరగతుల విద్యార్థులు ఈ ఉత్సవంలో పాల్గొంటారని, వారిలో విజేతలు రాష్ట్రస్థాయికి ఎంపికవుతారని తెలిపారు. నోడల్ ఆఫీసర్ బిజి.మధు కళా ఉత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను సమన్వయం చేస్తున్నారు.

యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి- కోడుమూరు

పట్టణానికి చెందిన యువకుడు బోయ భాస్కర్ (20) ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి... పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన భాస్కర్ గౌవుండా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మృతునికి ఇంకా వివాహం కాలేదు. అతడు రోజూ మద్యం తాగి ఇంటికొచ్చి తల్లిని వేధిస్తూ ఉండేవారు. అతని తల్లి నిత్యం దండిస్తూ ఉండేవారు. సోమవారం ఉదయం 7 గంటలకే మద్యం తీసుకొచ్చి ఇంటి వద్ద తాగుతుండగా తల్లి దండించారు. అతడు మనస్తాపం చెంది పక్కన ఉన్న కొట్టంలోకి వెళ్లి చీరతో ఉరేసుకున్నారు. తల్లి కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేత్రదానంపై మైపర్‌లో అవగాహనా సదస్సు



ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మైపర్ ఫార్మసీ కళాశాలలో నేత్రదానం పక్షంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆప్తమాలజిస్ట్ డాక్టర్ కె.స్వాతి హాజరై విద్యార్థులకు నేత్రదానం ప్రాధాన్యతపై వివరించారు. ఆమె మాట్లాడుతూ... ఒక నేత్రదాత జీవితం ముగిసిన తరువాత కనీసం ఇద్దరికి వెలుగునిచ్చే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు, యువత నేత్రదానంపై చైతన్యం పెంచి సమాజంలో వెలుగును పంచాలని కోరారు. ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని నేత్రదానంపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. నేత్రదానంపై సంకల్పబద్ధతతో ముందుకు రావాలని పలు ప్రతిజ్ఞలు విద్యార్థులు చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ మైపర్ విద్యార్థులు సామాజిక బాధ్యతతో ముందడుగు వేస్తూ నేత్రదానం వంటి మానవతా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం గర్వకారణమని తెలిపారు. నేత్రదానంపై ప్రమాణం చేస్తూ అవగాహన ప్రతిజ్ఞ పత్రాలను విద్యార్థులకు పంపిణీ చేశారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

- టిడిపి మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - కోడుమూరు

వైసిపి నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలని టిడిపి మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. పోలకల్ గ్రామంలో వైసిపి నాయకుల సూచనల మేరకే కొందరు వ్యక్తులు మద్యం సేవించి, ఖాళీ పురుగు మందు డబ్బాలను చూపించారని, ఇలాంటి చేష్టలు మానుకోవాలని హితవు పలికారు. సాగు, తాగునీటి కోసం రాత్రి 11 గంటలకు వచ్చి కలెక్టర్‌కు ఫోన్ చేసి నీటి సమస్యను తీర్చిన ఘనత ఒక్క విష్ణువర్ధన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. టిడిపి పట్టణ అధ్యక్షులు గంగాధర్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం 90 శాతం హామీలు నెరవేర్చడంతో స్థానిక ఎన్నికల్లో పట్టుకోల్పోతామనే భయంతోనే వైసిపి నాయకులు ఇలాంటి చేష్టలకు పాల్పడుతున్నారని విమర్శించారు. గోరంట్ల మధు, ఎల్లప్ప నాయుడు, పురుషోత్తం రెడ్డి, శంకర్ రెడ్డి, మాల మునిస్వామి, రవీంద్ర గౌడ్, వెంకటేశ్వర్లు, అయ్యప్ప, బలరాం పాల్గొన్నారు.

